కబ్జాకు గురైన పార్కు స్థలం పరిశీలన


హైడ్రా ఎఫ్‌ఆర్‌ఓకు పార్కు స్థలం కబ్జా గురించి వివరిస్తున్న కాలనీ అధ్యక్షుడు బాబు తదితరులు

హయత్‌నగర్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధిలోని శివగంగా కాలనీలో కబ్జాకు గురైన పార్కు స్థలాన్ని గురువారం హైడ్రా అధికారులు పరిశీలించారు. కాలనీకి చెందిన పార్కు స్థలాన్ని పక్క కాలనీకి చెందిన చంద్రారెడ్డి కబ్జా చేశారని కాలనీ అధ్యక్షుడు తొంట బాబు ఇటీవల హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు హైడ్రా ఎఫ్‌ఆర్‌వో బాచిరెడ్డి కబ్జాకు గురైన పార్కు స్థల వివరాలను అధ్యక్షుడు బాబును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శివగంగా కాలనీ లేఅవుట్‌లో పార్కు స్థలాన్ని పరిశీలించారు. అదేవిధంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న చంద్రారెడ్డి ప్లాట్ల పత్రాలను పరిశీలించారు. పార్కుకు చెందిన సుమారు 153 గజాల స్థలం కబ్జా అయిందని బాచిరెడ్డికి వివరించారు. దాని విలువ సుమారు కోటి రూపాయలు ఉంటుదని కాలనీవాసులు తెలిపారు. నివేదికను కమిషనర్‌కు అందజేసిన అనంతరం చర్యలు ఉంటాయని ఎఫ్‌ఆర్‌ఓ కాలనీ వాసులకు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, సెక్రెటరీ సతీష్‌రెడ్డి, నర్సింహయాదవ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోండి


సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్

వనస్థలిపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరూ సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. వనస్థలిపురానికి చెందిన భవిరిశెట్టి జ్యోతి అనారోగ్యానికి గురై ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సకు అధిక మొత్తంలో ఖర్చులు అయ్యాయి. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కాంగ్రెస్ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు కట్ల నర్సింహయాదవ్‌తో కలిసి మధుయాష్కీగౌడ్ సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంజూరైన రూ.60వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బాధిత కుటుంబానికి మధుయాష్కీగౌడ్ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎంతోమందికి ఆర్థిక ఉపశమనం కలిగిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు నర్సింహయాదవ్, నరేష్, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.


వీల్‌చైర్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్లు భాగ్యలక్ష్మి, అరుణారెడ్డి

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

చాదర్‌ఘాట్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మూసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు. గురువారం శ్రీపురంకాలనీ కమ్యూనిటీ హాల్‌లో జీహెచ్‌ఎంసీ యూసీడీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు, సీనియర్ సిటిజన్లకు చేతి కర్రలను సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. దివ్యాంగులు ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సర్కిల్-6 డీపీఓ యుగేందర్‌రెడ్డి, వీఆర్‌పీ నర్సింహ, సీఓ నర్సింహులు పాల్గొన్నారు.


5కే వాక్‌థన్ రన్‌లో కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ కరుణాకర్‌రెడ్డి

ఘనంగా ప్రపంచ కిడ్నీ దినోత్సవం

చంపాపేట, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని లింగోజీగూడ డివిజన్‌లోని గ్లెనీగల్స్ అవేర్ ఆస్పత్రి వారు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన 5కేవాక్‌థన్ రన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ కిడ్నీ వ్యాధులు రోజురోజుకు పెరుగుతున్నాయని, తద్వారా వచ్చే మరిన్ని సమస్యలను నివారించడం, ముందస్తుగా గుర్తించడం ఎంతో ముఖ్యమని అన్నారు. గ్లెనీగల్స్ అవేర్ ఆస్పత్రిలో రూ.999 కిడ్నీ హెల్త్ ప్యాకేజీని ప్రవేశపెట్టిందని తెలిపారు. డయాబెటిస్, బీపీ, కాలేయ వ్యాధులు, 40ఏండ్లు పైబడిన వారు ఈ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో యూరాలజీ డాక్టర్ నవీన్‌పూల, నెఫ్రాలజీ డాక్టర్ ప్రభుచరణ్, వైద్యులు పాల్గొన్నారు.

సినీ దర్శకుడు పీసీ ఆదిత్యకు 'ఉప్పల' అభినందన


పీసీ ఆదిత్యను సన్మానిస్తున్న శ్రీనివాస్‌గుప్తా

మన్సూరాబాద్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఇటీవల నిర్వహించిన ఓ వేడుకలో మహాత్మాగాంధీ స్మారక పురస్కారాన్ని అందుకున్న సినీ దర్శకుడు డాక్టర్ పీసీ ఆదిత్యను టీపీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అభినందించారు. ఈ సందర్భంగా నాగోల్‌లోని తన క్యాంపు కార్యాలయానికి గురువారం విచ్చేసిన పీసీ ఆదిత్యను శాలువాతో సన్మానించి మరిన్ని ఉత్తమ చిత్రాలతో మరెన్నో అవార్డు అందుకోవాలని ఆకాంక్షించారు.

ప్రభుత్వ బడుల్లో సౌకర్యాల కల్పనకు కృషి


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా డివిజన్ పరిధిలోని అన్ని సర్కారు బడుల్లో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నానని స్థానిక కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బీసీ కాలనీలోని ప్రైమరీ పాఠశాలలను గురువారం సందర్శించిన ఆయన అక్కడ చేపడుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ స్థానికుడు అరుణ్‌తేజ్ లక్ష రూపాయలు, ఓ ప్రైవేటు విద్యా సంస్థ రూ.2లక్షల సాయంతో ప్రభుత్వ పాఠశాలలోని బాలికలకు మరుగుదొడ్లు, ప్రహరీ నిర్మిస్తున్నామన్నారు. ప్రభుత్వ ప్రైమరీ, ఉన్నత పాఠశాలల విద్యార్థుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉన్న ప్రధానరోడ్డు వైపు ఉన్న గేటును తొలగించి ఆస్పత్రి వైపునకు మార్చనున్నట్లు తెలిపారు. స్థానికుడు అరుణ్‌తేజ్ మరో రూ.10లక్షల సాయంతో ఒకే చోటు ఉన్న ప్రైమరీ, ఉన్నత పాఠశాలలో బోరు, కలర్లు వేయిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాల కల్పనకు సాయం అందించేందుకు ముందుకు వస్తున్న వారిని కార్పొరేటర్ అభినందించారు.

మీర్‌పేట్‌లో ఇంటి పన్ను..
పెంచిందెవరు.. తగ్గించేదెవరు..?!

ప్రధాన రాజకీయ పార్టీల్లో క్రెడిట్ గేమ్


గురువారం సీడీఎంఏకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ అధ్యక్షులు భిక్షపతిచారి, ముఖేశ్ తదితరులు

సరూర్‌నగర్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ కార్పొరేషన్‌లో ఇంటి పన్నుల వ్యవహారం మూడు ప్రధాన పార్టీల మధ్య క్రెడిట్ గేమ్‌కు దారితీస్తోంది. అసలు అక్కడ ఇంటిపన్నులను విపరీతంగా పెంచిందెవరు.. దానిని తగ్గించేదెవరు? అన్న విషయం ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఒకప్పుడు గ్రామ పంచాయతీలుగా ఉన్న మీర్‌పేట్, జిల్లెలగూడ గ్రామాలను తొలుత మునిసిపాలిటీగా ఏర్పాటు చేసి, ఆ తర్వాత నగరపాలక సంస్థగా అప్‌గ్రేడ్ చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఇక్కడ ఇంటి పన్నుల మదింపులో శాస్త్రీయత లోపించిందనే ఆరోపణలున్నాయి. సీడీఎంఏ, మునిసిపల్ అధికారులు ప్రజల అభిప్రాయాలను తీసుకోకుండా, తమకు తోచిన రీతిలో పన్నులకు శ్లాబులు నిర్ణయించడంతో అది స్థానిక నివాసితులకు మోయలేని భారంగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి.

తాజాగా తెరపైకి బీజేపీ..

అటు కాంగ్రెస్, ఇటు బీఆర్‌ఎస్‌ల మధ్య ఇంటి పన్నుల వ్యవహారం క్రెడిట్ గేమ్‌గా మారగా.. తాజాగా బీజేపీ సైతం ఈ సమస్యను భుజాన వేసుకుంది. గత ఆదివారం కొందరు బీఆర్‌ఎస్ నేతల పెత్తనం ఎక్కువగా ఉన్న మీర్‌పేట్ కాలనీల అసోసియేషన్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి సబితారెడ్డి గైర్హాజరవగా, చల్లా హాజరయ్యారు. దాంతో నిర్వాహకులు ఆయనకు పన్నుల భారంపై వినతిపత్రం అందజేయగా, ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం చేయడానికి ప్రయత్నిస్తానని పేర్కొన్నారు. మరి ఏడాది కాలంగా ఆయన ఈ సమస్యపై ఎందుకు దృష్టి పెట్టలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అదలా ఉండగా మీర్‌పేట్ బీజేపీ క్లస్టర్-1,2ల అధ్యక్షులు పి.భిక్షపతిచారి, టి.ముఖేశ్‌కుమార్‌ముదిరాజ్ సైతం తమ పార్టీ నేతలతో కలిసి ఇంటి పన్నుల భారంపై గళం విప్పుతున్నారు. గత సోమవారం వారు ఈ సమస్యపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం అందజేసి, ఆ తర్వాత మునిసిపల్ కమిషనర్‌కు సైతం వినతిపత్రం సమర్పించారు. తాజాగా గురువారం ఇదే అంశంపై సీడీఎంఏకు వినతిపత్రం అందజేసి పన్నుల భారం తగ్గించకపోతే ప్రత్యక్ష ఆందోళనలకు దిగుతామని స్పష్టం చేశారు. మొత్తంమీద మీర్‌పేట్‌లో ఇంటి పన్నుల అంశం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారి, మూడు ప్రధాన రాజకీయ పార్టీలు క్రెడిట్ కొట్టేయడానికి ప్రయత్నిస్తున్నాయన్నది మాత్రం వాస్తవం! మరి ఈ సమస్య ఇప్పట్లో పరిష్కారమవుతుందా.. కాదా?.. ఒకవేళ పరిష్కారమైతే ఆ 'క్రెడిట్' ఎవరి ఖాతాలోకి వెళ్తుందన్నది ఆసక్తికర అంశంగా మారింది.


ఇటీవల మునిసిపల్ కమిషనర్ జ్ఞానేశ్వర్‌కు వినతిపత్రం సమర్పించిన బీజేపీ నాయకులు(ఫైల్)

నాడు ఆందోళన చేసిన నేతలు నేడు అధికార పార్టీలో..

ఆరు సంవత్సరాలుగా మీర్‌పేట్‌వాసులు పన్నుల భారంతో సతమతమవుతుండగా.. నాడు బీఆర్‌ఎస్ హయాంలో మంత్రిగా పని చేసిన సబితారెడ్డి సైతం ఆ భారాన్ని తగ్గించడంలో విఫలమయ్యారనే విమర్శలను మూటగట్టుకున్నారు. ఇక అప్పట్లో ప్రతిపక్ష కాంగ్రెస్‌లో రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడిగా కొనసాగిన జిల్లెలగూడకు చెందిన చల్లా నర్సింహారెడ్డి ఇక్కడి ఇంటి పన్నుల భారంపై ఆందోళనలు నిర్వహించారు. కాలనీలవాసులను సంఘటితపరిచి అధికారులపై ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నించారు. అయినప్పటికీ ప్రభుత్వం పన్నుల భారం తగ్గింపుపై ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండడం.. చల్లాకు టఫ్‌ఐడీసీ చైర్మన్ పదవి సైతం దక్కడంతో.. నాడు ఆందోళనలు చేసిన ఆయన నేడు ఈ సమస్య పరిష్కారానికి ఏ మేరకు కృషి చేస్తారనే చర్చ స్థానికంగా నడుస్తోంది. ఇక అప్పట్లో సబితారెడ్డి వెంట బీఆర్‌ఎస్‌లో చురుకుగా తిరిగిన నేతలు తాజాగా ఇంటి పన్నుల భారంపై గళం విప్పుతుండడం ఇక్కడ గమనార్హం! దాంతో నాటి అధికార పార్టీ.. నేటి అధికార పార్టీ నేతల మధ్య ఈ అంశం క్రెడిట్ గేమ్‌కు దారి తీసినట్టయిందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

నాకు మంచిపేరొస్తుందనే థీమ్ పార్కు ప్రారంభానికి అడ్డు

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి


థీమ్ పార్కులో పర్యటించి స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

వనస్థలిపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక కాంగ్రెస్ నాయకుడు మధుయాష్కీ అధికారులపై ఒత్తిడి తేవడంతోనే నిర్మించి నెలలు గడుస్తున్నా థీమ్ పార్కు ప్రారంభానికి నోచుకోవడం లేదని, ఎక్కడ నాకు మంచి పేరు వస్తుందనే దుర్బుద్ధితోనే వారు అడ్డుపడుతున్నారని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఎన్‌రెడ్డినగర్ ఫేజ్-3లో రూ.1.25కోట్లతో నిర్మించిన థీమ్ పార్కును ఎమ్మెల్యే గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు ఎకరం స్థలంలో అత్యాధునిక హంగులతో చిన్న, పెద్ద తేడా లేకుండా అందరికీ ఉపయోగపడేలా థీమ్ పార్కును నిర్మించామని, త్వరలోనే ఓపెన్ జిమ్‌ను సైతం ఏర్పాటు చేస్తామన్నారు. నెలలు గడిచినా పార్కును ఎందుకు ప్రారంభించడం లేదని స్థానికులు ఎమ్మెల్యేను ప్రశ్నించగా.. ఇందుకు ఆయన స్పందిస్తూ ఇన్‌చార్జి మంత్రి ప్రారంభిస్తారని స్థానిక కాంగ్రెస్ నేతలు వాయిదాలు వేస్తూ వస్తున్నారని, సుధీర్‌రెడ్డికి మంచి పేరొస్తుందనే కుట్రతోనే అధికారులపై ఒత్తిడి తెచ్చి ప్రజలకు ఉపయోగపడాల్సిన పార్కు ప్రారంభించడం లేదని ఆరోపించారు. ప్రొటోకాల్ దృష్ట్యా తాము ఓర్పుతో ఉన్నామని, ఇలాగే జాప్యం చేస్తూ ఎవరు అడ్డుపడినా త్వరలోనే థీమ్ పార్కును ప్రారంభిస్తామన్నారు. అనంతరం బీఎన్‌రెడ్డినగర్ అసోసియేషన్ ఆడిటోరియంలో నిర్మించిన ఓపెన్ జిమ్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ సభ్యులు అనిల్ చౌదరి, సుమన్‌గౌడ్, సతీష్‌కుమార్, రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

దౌత్య నియమాలపై మాట్లాడే నైతిక హక్కు లేదు

- శంకుస్థాపనకు 'వస్తా అని చెప్పి రాకుండా వంచించావ్'!
- కార్పొరేటర్ నర్సింహారెడ్డిపై బీఆర్‌ఎస్ నాయకుల ఆగ్రహం


మాట్లాడుతున్న కొప్పుల విఠల్‌రెడ్డి, జక్కిడి మల్లారెడ్డి తదితరులు

మన్సూరాబాద్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్‌లో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అందుబాటులో ఉన్నా.. లేకున్నా.. ఆయనతో సంబంధం లేకుండా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డికి దౌత్య నియమాల గురించి మాట్లాడే నైతికహక్కు లేదని మన్సూరాబాద్ బీఆర్‌ఎస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. తాను లేకుండా ఎమ్మెల్యే శంకుస్థాపన చేశాడంటూ కార్పొరేటర్ చేసిన వ్యాఖ్యలను గురువారం కేబీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. డివిజన్ పార్టీ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, ఇతర నాయకులు మాట్లాడారు. ఎమ్మెల్యే అందుబాటులో ఉన్నప్పటికీ పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ దౌత్య నియమాలు పాటించకుండా శంకుస్థాపనలు చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని, అయినప్పటికీ ప్రజా ప్రజయోజనాల కోసం జరిగే పనులపై రాద్ధాంతం చేయరాదని ఎమ్మెల్యే సూచించడంతో తాము ఊరుకున్నామని గుర్తుచేశారు. డివిజన్‌లో 95శాతం అభివృద్ధి పనులు ఎమ్మెల్యే చొరవతోనే జరిగాయని, గత నాలుగేళ్ల పాలనలో ఎవరెన్ని నిధులు తెచ్చారో చర్చలకు సిద్ధమా? అని ఆయనకి సవాల్ విసిరారు. 'ఇద్దరం ప్రతిపక్షంలోనే ఉన్నాం.. ఎవరి కొబ్బరికాయ వారు కొట్టి వేర్వేరుగానే శంకుస్థాపన చేసుకుందాం' అని పేర్కొనడం సరికాదని, అహంకారాన్ని పక్కనపెట్టి ఓట్లు వేసి గెలిపించిన ప్రజల కోసం పనిచేయాలని సూచించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు టంగుటూరి నాగరాజు, పోచబోయిన జగదీష్‌యాదవ్, రుద్ర యాదగిరి, జగదీష్‌గౌడ్, వెంకన్న, నర్సింగ్‌గౌడ్, చంద్రమోహన్, అంజి, ఈశ్వర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయండి

కొత్తపేట, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ కాలనీల్లో పలు సమస్యలున్నాయని వాటి పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని ఎల్బీనగర్ జెడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్‌కు కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ విన్నవించారు. గురువారం ఆయన జెడ్సీని కలిసి కాలనీల సమస్యలను విన్నవించారు. ఆ తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్‌ఆర్‌ఎల్ వద్ద తెలంగాణ పార్కులో, ప్రణయ్ నివాస్ -1 తదితర కాలనీల్లో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. స్నేహపురికాలనీలో పార్కు స్థలానికి ప్రహరీ నిర్మించాలని జెడ్సీని కోరారు. శ్రీశంకర్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో మరమ్మతు పనులు చేపట్టాలని విన్నవించారు. వర్షాకాలంలో వరదనీటి సమస్యలున్న కాలనీల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆయా కాలనీల్లో బాక్స్‌డ్రెయిన్ పనులు చేపట్టాలని కోరారు. బాక్స్‌డ్రెయిన్ పనుల కోసం రూ.2కోట్లు మంజూరు చేస్తామని జెడ్సీ స్పష్టం చేశారని కార్పొరేటర్ తెలిపారు. పలు కాలనీల అంతర్గత దారుల వద్ద హై మాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని విన్నవించారు. మూసీ పరీవాహక ప్రాంతాల్లో గల కాలనీల్లో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. కాలనీల్లో మెరుగైన పారిశుధ్య పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని, తగిన నిధులు మంజూరు చేస్తామని జెడ్సీ వెల్లడించారని కార్పొరేటర్ తెలిపారు. అనంతరం ఆయన జెడ్సీకి వినతిపత్రం సమర్పించామన్నారు.

మలక్‌పేట పీఎస్ పరిధిలో చెప్పుల దొంగల హల్‌చల్

- ఆటోలో వచ్చి దర్జాగా బూట్లు, చెప్పుల దొంగతనం
- బాధితుల్లో పోలీస్ ఇన్‌స్పెక్టర్, మహిళా ఎస్‌ఐ


ఘటన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు

చాదర్‌ఘాట్, మార్చి 13(ఆంధ్రజ్యోతి):దొంగోడికి చేప్పే లాభం అనే సామెతకు మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మూసారాంబాగ్ ఈస్ట్ ప్రశాంత్‌నగర్‌లో జరిగిన వింత చోరీ ఉదాహరణ.. ఇలాంటి దొంగతనం వల్లే పుట్టింది.. బుధవారం అర్ధరాత్రి ఈస్ట్ ప్రశాంత్‌నగర్‌లోని షైక్రో హెల్త్‌కేర్ అపార్ట్‌మెంట్‌తో పాటు మరో నాలుగు అపార్ట్‌మెంట్లలో చొరబడి ఇంటి ముందు ఉన్న బూట్లు, చెప్పులు ఎత్తుకెళ్లారు. ఉదయం బయటకు వచ్చి చూసేసరికి బూట్లు, చెప్పులు కనిపించలేదు. దీంతో అపార్ట్‌మెంట్‌వాసులు హైరానా పడ్డారు. సీసీ ఫుటేజీ పరిశీలించగా దొంగలు ఆటోలో వచ్చి బూట్లు, చెప్పులు ఎత్తుకెళ్తుండడం గమనించి ఆశ్చర్యపోయారు. ఓ పోలీస్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు మహిళా ఎస్‌ఐ షూలు సైతం దొంగలు ఎత్తుకెళ్లిపోయారు. చోరీ చేసిన బూట్లు, చెప్పులు సంచిలో మూటగట్టుకుని ఆటోలో దర్జాగా వెళ్లిపోవడం సీసీ కెమెరాలో నిక్షిప్తమైంది. వీటిని సెకెండ్ హ్యాండ్ మార్కెట్‌లో అమ్ముకునేందుకేనని బాధితులు అనుమానిస్తున్నారు. ఈస్ట్ ప్రశాంత్‌నగర్‌లోని షైక్రో హెల్త్‌కేర్ అపార్ట్‌మెంట్‌లోని ఆరు ఫ్లాట్ల ముందు విడిచిన 30 జతల బూట్లు, 25 జతల చెప్పులను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని బాధితుడు మహబూబ్ బాషా పోలీసులకు ఫిర్యాదు చేశారు. మలక్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ కరెన్సీ చలామణీ చేసేందుకు యత్నించిన ముఠా అరెస్టు

- నకిలీ కరెన్సీ, ఒరిజినల్ కరెన్సీ నోట్లు, సెల్‌ఫోన్లు, నకిలీ బంగారు బిస్కెట్లు, కారు స్వాధీనం


నిందితులు, పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ కరెన్సీ, ఒరిజినల్ కరెన్సీ నోట్లు, సెల్‌ఫోన్లు, నకిలీ బంగారు బిస్కెట్లు

కొత్తపేట, మార్చి 13(ఆంధ్రజ్యోతి): నకిలీ కరెన్సీ చలామణీ చేసేందుకు యత్నించిన ఏడుగురి ముఠాను ఎల్బీనగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఒక నిందితుడు పరారీలో ఉన్నాడు. వారి వద్ద నుంచి 11,50,000 నకిలీ కరెన్సీ, రూ.4లక్షలు ఒరిజినల్ కరెన్సీ నోట్లు, 7సెల్‌ఫోన్లు, 10 నకిలీ బంగారు బిస్కెట్లు, హోండా సిటీ కారు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌హెచ్‌ఓ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి నిజాంపేటకు చెందిన చిన్నోళ్ల మాణిక్యరెడ్డి(49) హయత్‌నగర్ పెద్దంబర్‌పేట్‌లో ఉండేవాడు. అతడు నకిలీ కరెన్సీ చలామణీ కేసులో ప్రధాన నిందితుడు. అతడి భార్య చనిపోయిన తర్వాత అప్పుల్లో కూరుకుపోయాడు. సులభంగా డబ్బు సంపాదించే మార్గాలను అన్వేషిస్తూ అహ్మదాబాద్‌కు చెందిన సురేష్ అనే నకిలీ కరెన్సీ చలామణీ చేసే వ్యక్తిని సంప్రదించాడు. ఈ యేడాది జనవరి నెలలో అతడు సురేష్‌ను కలిసి రూ.లక్ష చెల్లించి, రూ.11,50,000 నకిలీ కరెన్సీ నోట్లు కొనుగోలు చేసి, నగరానికి తీసుకొచ్చాడు. ఈ నేపథ్యంలో నకిలీ నోట్లు కొనే వారిని పరిచయం చేసి, మాణిక్యరెడ్డి వద్దకు పంపుతానన్నాడు. ఈనెల 11వ తేదీన సురేష్ మాణిక్యరెడ్డికి ఫోన్‌చేసి, విశాఖ కంచెర్లపాలెంకు చెందిన శివశంకర్‌ను పరిచయం చేశాడు. మాణిక్యరెడ్డి అతడిని గురువారం(13వ తేదీన) నగరానికి రమ్మని చెప్పాడు. అతడు రూ.4లక్షలు తీసుకుని నకిలీ కరెన్సీ కోసం నగర శివారు చింతలకుంటకు చేరుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడే కాపుకాసి ఏడుగురిని అదుపులోకి తీసుకొని విచారించారు. మాణిక్యరెడ్డిపై సంజీవరెడ్డి పీఎస్‌లో హత్యకేసు, భరత్‌కుమార్‌పై మైలార్‌దేవపల్లిలో, సత్యనారాయణపై సూర్యాపేట పీఎస్‌లో నకిలీ కరెన్సీ చలామణీ కేసులు ఉన్నట్లు తేలింది. నిందితులను రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న సురేష్ కోసం గాలిస్తున్నారు.


హోలీ సందర్భంగా శుక్రవారం వైన్స్‌లు బంద్ కానుండడంతో గురువారం కొత్తపేటలోని ఓ వైన్స్ వద్ద మద్యం కొనుగోలు చేస్తున్న మద్యంప్రియులు

చీరకట్టులోనే అతివ అందాలు

- మాంగళ్య షాపింగ్‌మాల్ చైర్మన్ కాసం నమశ్శివాయ
- మాంగళ్యలో చీరకట్టు(డ్రాపింగ్) కార్యక్రమం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మాంగళ్య షాపింగ్ మాల్ డైరెక్టర్లు పుల్లూరి అరుణ్‌కుమార్, అరుణ్‌కుమార్

హనుమకొండ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): స్త్రీల అందాలన్నీ చీరకట్టులోనే ప్రతిబింబిస్తాయని మాంగళ్య షాపింగ్ మాల్ చైర్మన్ కాసం నమశ్శివాయ అన్నారు. మాంగళ్య షాపింగ్ మాల్‌వారు హైదరాబాద్‌లో ప్రప్రథమంగా సారి డాపింగ్ (చీరకట్టు) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం హైదరాబాద్ వనస్థలిపురంలోని మాంగళ్యషాపింగ్ మాల్‌లో ఈ కార్యక్రమం జరిగింది. చెన్నైకి చెందిన ప్రముఖ సారీ డ్రాపర్ కవిత ఆధ్వర్యంలో మొదటిసారిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. చీరకట్టు ఎలా ఉండాలో కవిత వివరించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌లోని ఫ్యాషన్ డిజైనర్స్, బ్యూటీ పార్లర్ ప్రముఖులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఆద్యంతం ఎంతో ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో మాంగళ్య షాపింగ్ మాల్ చైర్మన్ కాసం నమశ్శివాయ, డైరెక్టర్లు కాసం శివ, పుల్లూరు అరుణ్‌కుమార్, తొనుపునూరి అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

16న మెగా జాబ్‌మేళా

హైదరాబాద్ సిటీ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాచకొండ పోలీసులు, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈనెల 16న మహిళల కోసం ప్రత్యేకంగా మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నారు. నాగోల్‌లోని ఎస్‌వీఎం గ్రాండ్ హోటల్‌లో నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళాను సీపీ సుధీర్‌బాబు ప్రారంభించనున్నారు. ఈ జాబ్‌మేళాలో ఐటీ, ఐటీఈఎస్, కోర్, ఫార్మా, హోటల్ మేనేజ్‌మెంట్, హాస్పిటాలిటీ, రీటైల్, ఎడ్యుకేషన్ రంగానికి చెందిన 50సంస్థలు పాల్గొంటాయని, పదోతరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఎంటెక్ అర్హత గలిగిన వారు పాల్గొన వచ్చని నిర్వాహకులు తెలిపారు.

ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకలు

సైదాబాద్ : ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ అన్నారు. ఐఎస్‌సదన్ డివిజన్ ముస్లింలు నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మానవులంతా సోదరభావంతో ఉండాలన్నారు. కార్యక్రమంలో మైనార్టీ ప్రతినిధులు అబ్దుల్ ఫిరోజ్, ఘనీ పాల్గొన్నారు.

సహజ రంగులతో హోలీ జరుపుకోవాలి

మన్సూరాబాద్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రసాయనాలతో చేసిన రంగులు కాకుండా సహజసిద్ధమైన రంగులతో హోలీ పండుగ జరుపుకోవాలని సరూర్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పారుపల్లి అనితాదయాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మహిళా అవేర్‌నెస్ రిసోర్స్ సొసైటీ(మార్స్) ఆధ్వర్యంలో గురువారం డివిజన్ పరిధిలోని సహజసిద్ధమైన రంగుల పంపిణీ కార్యక్రమానికి అనితాదయాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రజలకు రంగులను అందజేశారు. కార్యక్రమంలో మార్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చౌడీని ఆధునీకరించాలని డీసీకి వినతి

మన్సూరాబాద్ : సరూర్‌నగర్ గ్రామానికి చిహ్నంగా ఉన్న చౌడీని అత్యాధునిక హంగులతో సర్వాంగ సుందరంగా ఆధునీకరించాలని స్థానికులు కోరారు. ఈ మేరకు మార్నింగ్ వాక్‌లో భాగంగా చౌడీ వద్దకు గురువారం విచ్చేసిన సరూర్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుజాతకు స్థానిక కార్పొరేటర్ ఆకుల శ్రీవాణితో కలిసి వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో బేరా బాలకిషన్, ఆకుల అంజన్, గ్రామస్థులు దేవేందర్ ముదిరాజ్, పి.నాగరాజు ఉన్నారు.


డీడీ కౌన్సెలింగ్‌లో మాట్లాడుతున్న టీటీఐ ఇన్‌స్పెక్టర్ రాచపుడి

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

కొత్తపేట, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : నుక్కడ్ టీమ్ లీడర్ నవీన్ బృందం నాగోల్ జడ్పీహెచ్‌ఎస్, ఉప్పల్ ఆర్టీఏ, నాగోల్ ఆర్టీఏ టెస్ట్ డ్రైవింగ్ ట్రాక్ ఆవరణల్లో గురువారం ట్రాఫిక్ నిబంధనల ప్రాధాన్యత, నిబంధనలు పాటించకపోతే ఎదురయ్యే సమస్యలపై ప్రదర్శనలు నిర్వహించారు. ప్రధానంగా మద్యంమత్తులో, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, హెల్మెట్, సీటు బెల్టు పెట్టుకోకుండా వాహనాలు నడిపితే చోటు చేసుకునే ప్రమాదాలను గుర్తుచేసేలా ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమాల్లో టీటీఐ ఎస్‌ఐ నర్సింహారావు, సిబ్బంది రమేష్, హీరోమోటో కార్ప్ సేఫ్టీ ట్రెయినర్ ప్రవీణ్, నుక్కడ్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

టీటీఐ డీడీ కౌన్సెలింగ్‌కు 63మంది మద్యంప్రియులు

రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కు లెక్చర్ హాల్‌లో టీటీఐ డీడీ కౌన్సెలింగ్‌కు 63మంది మద్యంప్రియులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. టీటీఐ ఇన్‌స్పెక్టర్ రాచపుడి, విశ్రాంత ఇన్‌స్పెక్టర్ అమరవర్ధన్‌రెడ్డి, ఎస్‌ఓపీ అల్లూరయ్య వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. టీటీఐ ఆధ్వర్యంలో సిబ్బంది రాచకొండ పరిధిలోని అల్కాపురి, నాగోల్, చాణక్యపురి, ఉప్పల్ ప్రాంతాల్లో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో 591మంది పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | రాజు : 99854 02786